క్లుప్తంగా

నేడు నల్లగంగమ్మ జాతర



విద్యుద్దీపాల వెలుగుల్లో నల్లగంగమ్మ ఆలయం

సంబేపల్లె : మండల కేంద్రం సమీపంలో దేవర రాయి నల్లగంగమ్మ జాతర సందర్భంగా మండల కేంద్రం, దేవపట్ల మిట్ట, వివిధ ప్రాంతాలలో విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారి కటౌట్లు ఏర్పాటు చేశారు. మండలంతోపాటు పరిసర ప్రాంతాలలో జాతర శోభ సంతరించుకుంది. ఈ ప్రాంతం ఆడపడుచులు, అల్లుళ్లు, బంధువుల రాకతో పండుగ వాతావరణం గ్రామాలలో కనిపించింది. ఆలయాన్ని పచ్చని తోరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

జూనియర్ కళాశాల మంజూరు



పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిట్వేలి : పీఎంశ్రీ (హైస్కూల్ ప్లస్) పథకం కింద చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల మంజూరు చేశారని ఎంఈఓ కోదండనాయుడు, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డిలు తెలియజేశారు. బుధవారం ఇందుకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలను ప్రాంతీయ వ్యాయమ విద్యా సంచాలకులు భానుమూర్తి రాజు ఆవిష్కరించారు. నూతన విద్యా సంవత్సరం 2024 – 25కు సంబంధించి ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, సీఈసీ కోర్సులలో ఒక్కో గ్రూపులో 40 సీట్లు మంజూరయ్యాయని తెలిపారు. తరగతులు జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, బైపీసీ కోర్సులు కూడా మంజూరు చేయాలని వినతిపత్రం అందించామన్నారు. జూనియర్ కళాశాల మంజూరు పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

పరామర్శ



నందకుమార్ రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల, నాయకులు

పుల్లంపేట : పుల్లంపేట వైఎస్సార్ సీపీ యువనాయకుడు కసిరెడ్డి నందకుమార్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు బుధవారం అతన్ని పరామర్శించారు. అనంతరం ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, సుధాకర్ రాజు, ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు రాజీవ్‌గాంధీ

రాయచోటి అర్బన్ : భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు అని అన్నమయ్య జిల్లా డీసీసీ అధ్యక్షుడు, రాయచోటి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లాబకాష్ అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి వేడుకలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ ఓటు కనిష్ట పరిమితిని 18 సంవత్సరాలకు తగ్గించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. స్థానిక సంస్థలలో మహిళలకు 33 శాతం కల్పించిన మహిళా పక్షపాతి రాజీవ్ గాంధీ అని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

మంచి కార్యకర్తను కోల్పోయాం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న అజయ్‌రెడ్డి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని తిరునంపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మద్దెల గోపయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఒక మంచి కార్యకర్తను కోల్పోయిందని, మృతుడు గోపయ్య జగనన్న గెలిచేంత వరకు తాను గడ్డం కూడా తీసుకోనని కార్యకర్తలతో తెలిపారని ఇంతలోనే ఇలా జరగడం బాధాకరమన్నారు. నివాళి అర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుచ్చిరెడ్డి, వెంకటరత్నం, చిన్నయ్యలతోపాటు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రమణీయం.. లక్ష్మీ నృసింహుడి కల్యాణం



వీరబల్లె మండలం పెద్దవీడులో ప్రత్యేక అలంకరణ



కాసులగుట్ట శ్రీ లక్ష్మీనృసింహస్వామి



రాజంపేట: నందలూరు మండలం కాసులగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె – పాటూరు రహదారిలోని ఎర్రిపాపయ్యగారిపల్లె గ్రామ సమీపం ఉత్తర దిశలో వెలసిన కాసులగుట్ట శ్రీ లక్ష్మీనృసింహుని కళ్యాణం కమనీయంగా జరిగింది. బుధవారం ఉదయం కాసులగుట్ట వద్ద స్వామి వారి కల్యాణాన్ని వైఖానస ఆగమన శాస్త్ర ప్రకారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణలమధ్య కల్యాణ క్రతువు వైభవంగా సాగింది. మండలంలో లక్ష్మీ నృసింహుని ఆలయం ఇదొకటే కావడంతో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులకు సదుపాయాలను కల్పించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

వెంకన్న పాదాలకు పూజలు..

కాసులగుట్టపై వేంకటేశ్వరసామి పాదాలు ఉన్నాయి. వాటికి భక్తులు పూజలు నిర్వహించారు. ఈ గుట్టపై శ్రీవారి పాదాలు కలిగివుండటంతో ఈ గుట్టు ఒక ఆధ్యాత్మిక గుట్టగా ఇక్కడి ప్రాంతీయులు భావిస్తున్నారు. శ్రీలక్ష్మీనృసింహ కల్యాణోత్సవ సందర్భంగా భక్తుల సందడితో గుట్టపై ఆధ్యాత్మిక వాతవరణం వెల్లివిరిసింది.

రామాపురంలో..

రామాపురం : మండలంలోని బండపల్లె పంచాయతీలోని కంబరాయుడిగుట్టలో, గోపగుడిపల్లె పంచాయతీలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో బుధవారం ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలను ఆలయ నిర్వాహకులు నిర్వహించారు. ఉదయం నుంచే గణపతి పూజ నిర్వహించి, వచ్చిన మహిళలు అభిషేకాలు చేశారు. ఉత్సవాలకు గ్రామాలల్లోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిద్దవటం : మండలంలోని జెఎంజె కళాశాలకు ఎదురుగా వెలసిన శ్రీ పెంచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రెండవ రోజు బుధవారం లక్ష్మీదేవి, చెంచులక్ష్మీ సమేత నరసింహ స్వామి ఉత్సవమూర్తులకు అభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకరించారు. ఈ సందర్భంగా వేద పండితులు నైషధం ప్రతాప్‌శర్మ, రెడ్డినరేష్ శర్మలు వేద మంత్రాలతో స్వామి వారికి లక్ష్మీనారాయణ జపం, నరసింహ హోమం, సుదర్శన హోమం, పూర్ణాహుతి, కూశ్మాండ బలి వంటి పూజా కార్యాక్రమాలను నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనరసింహ స్వామి సహస్రనామావళి, దీక్షా హోమం, తీర్థప్రసాదాల వినియోగం వంటి పూజలు నిర్వహించారు. రాత్రి కడపకు చెందిన రవితేజ బృందంచే చెక్కభజనల కార్యక్రమాన్ని పాలెం చిన్న సుబ్బరాయుడు, తిరుపతమ్మ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలియజేశారు. గురువారం ఉదయం 10 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం జరుగునని భక్తులు విరివిగా పాల్గొనాలని ఆలయ వైస్ చైర్మన్ గిరిప్రసాద్ తెలిపారు.



రైల్వేకోడూరు అర్బన్ : కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల పరిధిలోని పెద్దివీడు గ్రామం సమీపాన మాండవ్య నది ఒడ్డున గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి హోమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పూలు, పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. అలాగే బుధవారం లక్ష్మీనరసింహ స్వామి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి తిరునాల నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త విశ్వనాథరెడ్డి తెలిపారు. తిరునాలలో భాగంగా రాత్రి చాందినీ బండ్ల మెరవణి, భక్తుల వినోదం కోసం బాలనాగమ్మ వీధి నాటకం ప్రదర్శింపజేశారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం అన్నప్రసాదం అందజేశారు. ఈ తిరునాలకు స్థానిక భక్తుల తోపాటు ఇతర గ్రామాల నుంచి విశేషంగా తరలి వచ్చారు.

మండెం లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని జల్లావాండ్లపల్లె గ్రామం మాండవ్యా నదీ తీరాన వెలసివున్న శ్రీ మండెం లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. బుధవారం స్వామి వారి జయంతిని పురస్కరించుకొని ఉత్సవ విగ్రహమూర్తులను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు చేశారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



రైల్వేకోడూరు అర్బన్ : స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

రెడ్డివారిపల్లెలో వైభవంగా కల్యాణం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రెడ్డివారిపల్లెలో వెలసివున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు పంద్రా నరసింహులు దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా వైభవోపేతంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఉదయం భక్తుల మధ్యలో స్వాముల మూల విరాట్‌లకు పంచామృతాభిషేకాలు, ఉత్సవ మూర్తులకు మంగళ స్నానాలు చేశారు. అలాగే సాయంత్రం 8 గంటలకు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణలు చేసి కల్యాణోత్సవాన్ని జరిపారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. తదుపరి భక్తులకు తీర్థప్రసాదాలు, అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నంశెట్టి శివయ్య, తోట యుగంధర్, తోట హరి, పి.సునీల్, టి.మాధవరావు, నరసింహులు, నరసయ్య, చంద్ర, రాజశేఖర్ రాజు, మలిశెట్టి పెంచలయ్య, ఆంజనేయ వరప్రసాద్, రామయ్య, మణి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావడం ఖాయమని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి పెంచల కొండపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టు తరఫున వేద పండితులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. మే 13న జరిగిన ఎన్నికల్లో మహిళలు పెద్దసంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. మహిళల ఆశీస్సులు, లక్ష్మీ నరసింహస్వామి దీవెనలతో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మరోసారి ప్రమాణస్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.



సిద్దవటం: ప్రత్యేక పూజలందుకున్న స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులు



చిన్నమండెం: ప్రత్యేక అలంకరణలో మండెం లక్ష్మీనారసింహుడు



రామాపురం: గోపగుడిపల్లెలోని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

పెంచలకొండపై మహా అన్నదానం

మండలంలోని ఈటమాపురం గ్రామ సమీపంలోని పెంచలకొండపై వెలసివున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద తూర్పుపల్లి గ్రామ ప్రజలు బుధవారం రాత్రి మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసింహ జయంతి సందర్భంగా పంచాయతీలోని ఈటమాపురం, నాయుడువారి పల్లి, తూర్పుపల్లి గ్రామాల ప్రజలు ఒక్కో సంవత్సరం ఒక్కో గ్రామం వంతున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది తూర్పుపల్లి గ్రామ ప్రజల వంతు రావడంతో ఆరువేల మందికి రుచికరమైన వంటలను అందించారు. పార్టీలకు అతీతంగా గ్రామప్రజలు ఏకతాటిపై నిలిచి ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జీవ వైవిధ్యంతో పర్యావరణాన్ని కాపాడుదాం



బంజరు భూమిలో మొక్కలు నాటుతున్న శ్రీదేవి

రామాపురం : జీవ వైవిధ్యాన్ని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని జీవ వైవిధ్య పరిరక్షణ అవార్డు గ్రహీత సూరం శ్రీదేవి అన్నారు. ప్రపంచ జీవ వైవిధ్య పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని వ్యవసాయానికి పనికిరాని బీడు, బంజరు భూములలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మాట్లాడుతూ మానవ మనుగడకు జీవనాధారం మొక్కలేనని, మొక్కలు లేనిదే మానవ జీవితం కడు దుర్భరంగా మారుతుందన్నారు. మొక్కలు విరివిగా నాటడంతో జీవకోటికి ప్రాణవాయువు పుష్కలంగా లభిస్తుందని, భూమిపై ఆక్సిజన్ పెరగాలన్న, కార్బన్‌డయాక్సైడ్ శాతం తగ్గాలంటే మొక్కల వలే సాధ్యమన్నారు. ప్రకృతి విపత్తులకు కారణం జీవవైవిధ్యంలో తేడా రావడమే కారణమన్నారు. దీని వలన పెద్ద ఎత్తున ప్రాణ నష్టంతోపాటు ఆపార ఆస్థి నష్టం జరుగుతాయన్నారు. అందరూ జీవ వైవిధ్యంపై శ్రద్ధ చూపి ఖాళీగా ఉన్న బీడు, బంజరు భూములలో ప్రభుత్వ కార్యాలయాలలో, గుట్టలు, కొండలు, వాగులు, వంకలు, పుట్టలు, కొండ వాలు వద్ద ప్రతి మనిషి ఒక చెట్టు నాటి, దాని సంరక్షణ చేపడితే వర్షాలు బాగా పడి భూతాపం తగ్గి భూమి హరితమయం అవుతుందని చెప్పారు. మొక్కలే ప్రగతికి మెట్లని, ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ సూరం వెంకట్రామిరెడ్డి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేడుకగా వీరాంజనేయుడి తిరునాల



భక్తులకు దర్శనమిస్తున్న వీరాంజనేయస్వామి

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీలోని పాలబండ సమీపంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి తిరునాల బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. ముందుగా ఆలయాన్ని వివిధ రకాల విద్యుద్దీపాలతో అలంకరించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు రాత్రి చాందినీ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. హీరో సబ్బవరం కిరణ్ తిరునాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించి, మొక్కును తీర్చుకున్నారు.

వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు మృతి

చిన్నమండెం : మండల పరిధిలోని కలిబండ గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు సీత. అశోక్‌రెడ్డి(54) గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి అశోక్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అదే విధంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి స్థానిక సర్పంచ్ జగన్నాథరెడ్డికి ఫోన్ చేసి బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

సబ్సిడీ కింద వేరుశనగ విత్తనకాయలు

రామాపురం : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులకు 40శాతం సబ్సిడీతో వేరుశన విత్తనకాయలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి నాగమణి తెలిపారు. మండలానికి కే6 రకం 550 క్వింటాళ్లు, నారాయణి 790 క్వింటాళ్లు మంజూరయ్యాయన్నారు. కే6 30 కిలోల బస్తా రూ.2,850లు సబ్సిడీ (40శాతం) రూ.1,140లు పోనూ రైతులకు రూ.1,710లకు విక్రయిస్తున్నామని చెప్పారు. నారాయణి ధర రూ.2,910లు సబ్సిడీ (40 శాతం) రూ.1,164లు పోనూ రైతులకు రూ.1,746లు రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతుల పొలం విస్తీర్ణాన్ని బట్టి విత్తన కాయలు పంపిణీ ఉంటుందన్నారు. 50 సెంట్లుకు ఒక బస్తా, ఒక ఎకరాలోపు అయితే 2 బస్తాలు, ఎకరాపై ఉంటే గరిష్టంగా 3 బస్తాలు ఇవ్వనున్నట్టు తెలియజేశారు. రైతులందరూ ఆయా గ్రామాల రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్నవారికి విత్తన వేరుశనగకాయలు పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

వైభవంగా కాలభైరవుడి తిరునాల



ప్రత్యేక పూజలందుకున్న కాలభైరవుడు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపాన గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడి తిరునాల అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ తిరునాలలో భాగంగా బుధవారం ఉదయం స్వామి వారికి పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం ఆలయంలో హోమం నిర్వహించి పూర్ణాహతి సమర్పించారు. అంతకుముందు గోపూజ కార్యక్రమం చేయించారు. అలాగే స్వామి వారికి బుడ్డా ధర్మారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. తిరునాలలో భాగంగా ఆలయానికి వచ్చే భక్తులకు మాసగాని కిరణ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

23 నుంచి మాచుపల్లె రేణుకా యల్లమాంబ జాతర



రేణుకా యల్లమాంబ మూలవిరాట్

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలోని పెన్నానది ఒడ్డున వెలసిన జగజ్జనని శ్రీ రేణుకా యల్లమాంబ జాతర ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరుగునని గ్రామ పెద్దలు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన తెల్లవారుజామున అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 24న రాత్రి అమ్మవారి ఊరేగింపు, అనంతరం ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 25న మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం సింహ వాహనంపై ఊరేగింపు, అమ్మవారి కథ శ్రవణం, పాటల కచేరి ఉంటాయన్నారు. 26వ తేదీ అమ్మవారికి బోనాల సమర్పణ, రాత్రి శేష వాహనంపై అమ్మవారి ఊరేగింపు, చెక్క భజనలు, పండరి భజనలు ఉంటాయన్నారు. 27వ తేదీన ఉదయం అమ్మవారి ఊరేగింపు, వసంతోత్సవం ఉంటుందన్నారు. కావున భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని గ్రామ పెద్దలు కోరారు. ప్రతి రోజు కడప రాజా జ్యువెలర్స్ అధినేత జరుగు రాజశేఖర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని వారు తెలియజేశారు.

ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు



గాలివీడు: సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామచంద్రరావు



సిద్దవటం: రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ రమాకాంత్



కల్పనాయునిచెరువులో గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

గాలివీడు : చట్టానికి అందరూ సమానమేనని, ధనిక పేద అనే తారతమ్యం ఉండదని, దానికి అందరూ లోబడే నడుచుకోవాలని రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అందరి సహకారంతో మండలంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయన్నారు. అలాగే జూన్ 4వ తేదీ కౌంటింగ్ రోజు వరకు అందరూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని గ్రామాల్లో పార్టీ నాయకులు, ప్రజలను రెచ్చగొట్టే వ్యవహారాలు చేయరాదని హెచ్చరించారు. కక్షలకు, కార్పన్యాలకు వెళితే మీ జీవితాలు ప్రమాదంలో పడతాయని చెప్పారు. ఎవరూ ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి ఘర్షణలకు దిగితే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు గొడవలకు దిగి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ ప్రక్రియలో ఎవరు కౌంటింగ్ కేంద్రాల వద్దకు రావద్దని పేర్కొన్నారు. అన్ని పార్టీల నాయకులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఎవరు గెలిచిన అందరూ కలిసికట్టుగా మీ గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి సహకరించుకోవాలని తెలియజేశారు. సమావేశంలో లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగాధర్ బాబు, మండల ఎస్ఐ వెంకటప్రసాద్, ఏఎస్ఐ అంజిరెడ్డి, పోలీసు సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌లు లొంగిపోవాలి

సిద్దవటం : జూన్ నెల 4వ తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్ రోజున రౌడీ షీటర్లు సిద్దవటం పోలీసుస్టేషన్‌లో లొంగిపోవాలని ఎన్నికల స్పెషల్ డీఎస్పీ రమాకాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో బుధవారం సాయంత్రం డీఎస్పీ రామాకాంత్ రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో బూతుల వద్ద, గ్రామాల్లో, ఘర్షణలు, తోపులాటలు చేసిన వారిని గుర్తించామన్నారు. వివిధ కేసుల్లో ఉన్న వారు ప్రతి ఒక్కరూ ఎన్నికల కౌంటింగ్ రోజున సిద్దవటం పోలీసు స్టేషన్‌లో స్వచ్ఛందంగా లొంగిపోవాలన్నారు. ఎన్నికల ఫలితాల రోజున ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు గానీ, హింసాత్మక ఘటనలకు గాని పాల్పడినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరూ నలుగురు మించి గుమికూడి ఉండరాదన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ పెద్ద ఓబన్న, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

రామాపురం : రాబోయే ఎన్నికల ఫలితాల దృష్ట్యా ప్రజలు గ్రామాల్లో ఎలాంటి నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథబాబు హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు రాబోయే ఎన్నికల ఫలితాలలో భాగంగా బీఎస్ఎఫ్ కేంద్ర బలగాలు, మండల ఎస్ఐ వి.లక్ష్మీప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో బుధవారం సుద్దమళ్ల పంచాయతీ దూదేకులపల్లెలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి, కల్పనాయునిచెరువు గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామాలలో ఎలాంటి నేరాలకు, అవాంఛనీయ సంఘటనలకు, ఘర్షణలు పాల్పడవద్దని, ఎవరైనా గొడవలకు దిగితే వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు అవసరమైన వారిపై హిస్టరీ షీట్ తెరుస్తామని హెచ్చరించారు.

యువత ప్రశ్నించే గుణాన్ని అలవరుచుకోవాలి

నందలూరు(రాజంపేట) : నేటి యువత ప్రశ్నించే గుణాన్ని అలవరుచుకొని సమాజ అభివృద్ధికి పాటుపడాలని రాజంపేట డీఎస్పీ చైతన్య అన్నారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లిలోని నందలూరు జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జయాపజయాలను సమానంగా తీసుకోవాలన్నారు. ఐక్యతతో ఏదైనా సాధించవచ్చని, సమష్టి కృషితో విజయం సాధ్యమని తెలిపారు. మొదట మ్యాచ్‌లో నందలూరు పోలీస్, నందలూరు ప్రెస్ జట్లు తలపడగా నందలూరు ప్రెస్ జట్టుపై నందలూరు పోలీస్ జట్టు విజయం సాధించింది. నందలూరు ఎస్ఐ మహమ్మద్ జహీర్ 49 పరుగులు చేసి రెండు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నారు. కార్యక్రమంలో పోతురాజు మస్తానయ్య, ఆర్గనైజర్స్ పి.గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, శివకోటి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ చైతన్య